# దాహం

**అప్పుడే స్నానంచేసి బెంగాల్ చీర కట్టుకుని, దానికి మేచింగ్ బ్లౌజ్ వేసుకుని, ముఖానికి లైట్‌గా పౌడరు రాసుకుని, మెరూన్ కలర్ స్టిక్కర్ నుదుట పెట్టుకుని, పొడుగ్గా వున్న జడని ముడివేసి వంటింట్లోకి నడిచింది జయ.**

భాస్కరం రెప్ప వెయ్యడం మర్చిపోయి ఆమె వెళ్తున్నవైపు అలా చూస్తూండిపోయాడు.

ఆమె నడక అద్భుతం!

ఆమె నవ్వు అద్భుతం!

ఆమె చూపు అద్వితీయం!

చిద్విలాసంగా నవ్వే పెదవులు, పచ్చని పసిమితో మెరిసే నున్నవి ఆమె చెక్కిళ్ళు తల్చుకోగానే భాస్కరానికి 'ఎటో వెళ్ళిపోయింది మనసు...' పాట గుర్తుకొచ్చింది. వెన్నెలను వెదజల్లే పూర్ణచంద్రబింబం లాంటి ముఖం ఆమెది! మరి ఆగలేక ఆమె వెనకే వంటింట్లోకి నడిచాడు భాస్కరం. మెల్లగా వెనకనుంచుని ఆమె భుజం మీద చేయివేసి, "జయా!... ఈ రోజెందుకో... కొత్తగా... కొత్తపెళ్ళికూతురిలా కనబడ్తున్నావోయ్! ఇవాళ ఆఫీసుకి శలవు పెట్టమంటావేమిటి చెప్పు?!" ఆమె కళ్ళల్లోకి తన్మయత్వంతో చూస్తూ మత్తుగా అన్నాడు భాస్కరం.

వెన్నెల విరబూసినట్టుగా, మల్లెలు రాలినట్టుగా మధురంగా నవ్వింది జయ! మురిపెంగా భర్త చెవి పట్టుకులాగుతూ, "సంతోషించాం, మహాశయా! కాని మీరు శలవు పెట్టేస్తే మీ మేనేజరు వూరుకుంటాడా... అని...!" సందేహం వెలిబుచ్చింది.

మేనేజరు పేరు వినగానే భార్య మత్తులోంచి బయటపడ్డారు భాస్కరం. "హమ్మో! అన్నట్టు వాడొకడు నాకు మొగుడు కదా ఆఫీసులో. ఒక్కరోజు ఆఫీసుకు వెళ్ళకపోతే సవాలక్ష కారణాలు అడుగుతాడు!... "ఏం నాయనా! నైట్‌షోలు చాలక మార్నింగ్ షోలు, మ్యాట్నీలు కూడా మొదలుపెట్టేశావా?" అని నన్ను నఖశిఖపర్యంతం గుచ్చిగుచ్చి చూస్తూ అడుగుతాడు!..." అంటూ అక్కడ్నుంచి స్నానాలగదిలోకి దూరేడు భాస్కరం.

పక్కగదిలోనే చదువుకుంటున్న పిల్లలు పరిగెత్తుకు వచ్చి తల్లిని చుట్టేశారు సంతోషంగా. "మమ్మీ! డాడీ మార్నింగ్ షో... మేట్నీ అంటున్నారు! మనం సినిమాకి వెళ్తున్నామా? ఎప్పుడు మమ్మీ! మమ్మల్ని కూడా తీసుకువెళ్తారా?!" అని అడుగుతోన్న పిల్లల్ని చూసి నవ్వుకుంటూ ఏదో సర్దిచెప్పి వాళ్లని అవతలకి పంపించింది. కాని భర్త మీద అందంగా విసుక్కుంటూ "ఈయన ఎప్పుడూ ఇంతే! కొండమీద గోల ఏమిటి అంటే ఎవరో ఇద్దరు రహస్యం మాట్లాడుకుంటున్నారు అన్నట్టు... ఏది గట్టిగా మాట్లాడాలో, ఏది మెల్లగా మాట్లాడాలో తెలిసి చావదు. పిల్లవెధవలు మ్యాట్నీ అంటే పాపం నిజంగా మ్యాట్నీ సినిమా అనుకుంటున్నారు!" సిగ్గు ముంచుకొచ్చింది జయకి, మ్యాట్నీలు, మార్నింగ్‌షోలు తల్చుకోగానే...

ఆ ఇల్లు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లా వుంటుంది!

విశాఖపట్నం లాంటి వూర్లో అన్నీ పోను మూడు వేలు చేతికొస్తున్న తనలాంటి వాళ్లకి ఎనిమిది వందలు అద్దెకి ఇల్లు దొరికిందంటే చాలా గొప్ప విషయమే! ముచ్చటగా మూడే... చిన్న చిన్న గదులు, గదిలో గది.

ముందుగది డ్రాయింగ్ రూమ్; మధ్య గది బెడ్‌రూమ్; వెనక గది కిచెన్!... వంటిల్లు దాటాక చిన్న బాత్రూం కమ్ లెట్రిన్. పిల్లలు డ్రాయింగ్ రూమ్‌లోనే పడుకుంటారు. రాత్రి వాళ్ళు బాత్‌రూం కెళ్లాలంటే తల్లి - తండ్రి పడుకునే గది దాటి వెళ్ళాలి!...

సాయంత్రం నుంచి వర్షం పడుతున్నాది.

ముందు సన్నగా మొదలైన చినుకులు తర్వాత పెద్ద వర్షంగా మారిపోయాయి. హోరుమనే శబ్దంతో విసురుగా వీస్తూ అన్నింటిని ఢీకొంటున్నది గాలి. కిటికీ తలుపులు తపతప కొట్టుకుంటున్నాయి. పరదాలు ఎగురుతున్నాయి. వర్షం ఏటవాలుగా, ఉధృతంగా పడుతోంది. ఉన్నట్టుండి కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు, చెవులు హోరెత్తిపోయేలా వురుములు!

రాత్రి తొమ్మిది గంటలు దాటిపోయింది. కాని భాస్కరం ఇంకా రాలేదు. వీధి అరుగుమీద కొచ్చి చూసింది, వస్తున్నాడేమోనని. వర్షం జల్లు ముఖం మీద గట్టిగా కొట్టడంతో లోపలికి వచ్చేసింది.

ఈ వర్షంలో ఆయన ఎలా వస్తారో? స్కూటర్ మీద వచ్చినా తడిసిపోతారు. కిటికీ దగ్గర కుర్చీ వేసుక్కూర్చుంది. పిల్లలు మాత్రం పరీక్షలు దగ్గరకొస్తున్నాయని పట్టుదలగా, శ్రద్ధగా చదువుకుంటున్నారు. బాబీ తొమ్మిది చదువుతున్నాడు. కిరణ్ ఏడు: ఇద్దరూ బాగా చదువుకుని మంచి మార్కులతో పాసవుతున్నారు. ఇప్పటిదాకా చదవమని వాళ్ళకి ప్రత్యేకంగా చెప్పే అవసరం రాదు!... కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్న జయ బయట స్కూటరు శబ్దంతో కళ్లు విప్పి దిగ్గున లేచింది... వర్షం పూర్తిగా తగ్గిపోయింది.

భాస్కరం స్కూటర్ని మీదకు తీసుకువచ్చి అరుగు మీద ఒక వారగా పెట్టాడు. అరుగంతా బురదయి పోయింది. పాంటు - షర్టు విప్పి లుంగీ కట్టుకున్నాడు.

"పిల్లలు ఇంకా పడుకోలేదా? వాళ్ళు మంచి నిద్రలో వుంటారనుకున్నాను!" మెల్లగా అన్నాడు ఆమె కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ. దానర్థం తెల్సిన జయ సిగ్గుగా నవ్వింది. జయ ఇద్దరికీ అన్నం, కూరలు వడ్డిస్తోంది.

"నువ్వు భోం చెయ్యకపోయావా?! నా కోసం ఎందుకు కూర్చోవడం?" అన్నాడు తన ఆలస్యానికి నొచ్చుకుంటున్నట్టుగా.

"ఫర్వాలేదండి".

ఉన్నట్టుండి భాస్కరం ఆమెకి దగ్గరగా వచ్చి ఆమె మెడని కొద్దిగా వెనక్కి వంచి అందమైన పెదవుల మీద గట్టిగా ముద్దు పెట్టుకుని... దాంతో ఆగక ముద్దొచ్చి కొరికాడు!

"అబ్బా!" గట్టిగా మూలిగింది జయ. అంతే! బాబీ పరుగెత్తుకొచ్చేశాడు అమ్మ కేమయిందోనని.

"ఏమయింది మమ్మీ? ఎందుకలా అరిచావు?" అడుగుతూంటే ఇద్దరూ తడబడ్డారు.

"ఏం లేదురా. చీమ కుట్టేసింది. అబ్బ! చీమ చిన్నదే గాని కుట్టిందంటే ఎంత మంటో!"

"అంతేనా!" నవ్వేసి వెళ్ళిపోయేడు బాబీ.

జయ, భాస్కరం కూడా నవ్వుకున్నారు.

"ఏయ్!"

తలెత్తి చూసింది భర్తవైపు.

"ఈ వెధవలిద్దరూ ఇంకా పడుకోలేదేమిటి?" గుర్రుగా చూస్తూ అన్నాడు.

"వాళ్ళకి పరీక్షలు. చదువుకుంటున్నారు!" నేనేం చేసేది- అన్న ధోరణిలో అంది.

"పడుకోమని చెప్పలేకపోయావా?"

"ఎలా చెప్పడం? పాపం శ్రద్ధగా చదువుకుంటుంటే!" పిల్లలవైపు మురిపెంగా చూస్తూ అంది జయ.

"ఉద్ధరించావుగాని, ఇప్పుడు పడుకోమని చెప్పు."

"నేనా!" అంది భయంగా

"లేకపోతే నేనా?" వెక్కిరిస్తూ అన్నాడు భాస్కరం.

"ప్లీజ్. మీరే చెప్పండి. వాళ్ళు మీమాట వింటారు!"

"లేదు, నువ్వే చెప్పు."

"అబ్బ! మీరే చెప్పండి. మీదగ్గర కొంచెం భయం వుంది వాళ్ళకి. మీరు చెప్తే వింటారు..."

మెల్లగా పిల్లల దగ్గరకొచ్చాడు భాస్కరం.

"ఒరేయ్ బాబీ! ఇంత రాత్రయింది! ఇంకెంతసేపు చదువుతారు. పడుకోండి. పొద్దున్నే లేచి చదువుదురుగాని."

"ఉండండి డాడీ! ఈ ఎస్సే కంప్లీట్ చేసి వచ్చేస్తాను" అన్నాడు బాబీ.

భాస్కరానికి ఓ వైపు మహాకోపంగా వుంది. అయినా ఏం చెయ్యలేని అయోమయంలో పడిపోయాడు. అతనికి ఒక్కసారిగా తను వున్న ఇంటిమీద కోపం వచ్చింది. ఈ మధ్యతరగతి బ్రతుకులన్నీ ఇలాగే వుంటాయి కాబోలు. గొర్రెకి బెత్తెడే తోక అన్నట్టు తనలాంటి చాలీచాలని జీతగాళ్ళకి ఈ మాత్రం కొంప దొరకడమే మహా అదృష్టం! మనుషులంతా ఒకటి. కాని ఈ గొప్ప - బీద అన్న తేడాలు మనుషులు ఏర్పరచుకున్నవే. హాయిగా గొప్పవాడయితే ఏ ఎ.సి. రూమ్‌లోనో శ్రీమతితో సరాగాలాడుతూ స్వర్గసుఖాల్లో తేలియాడుతాడు! కాని తను? శ్రీమతితో సరసాలు - సరదాలు తీర్చుకోవడం ఆకాశంలో నక్షత్రాలు అందుకోవడం అంత కష్టతరంగా వుంది. ఏం చెయ్యడం? అయినా ఈ జయకి బుద్ధి లేకపోతే సరి! తనొచ్చేలోగానే ఏదో ఒకటి చెప్పి వాళ్ళని పడుకోపెట్టేసి వుంటే... అలా చేసి వుంటే... హాయిగా ఈపాటికి తనూ... జయా... ఓహ్!

అతని మనసు తొందరపడుతున్నది. పిల్లలు పడుకున్నా కూడా వాళ్ళిద్దరూ కిచెన్‌లోనే దూరాలి. బెడ్ రూం తలుపు వాళ్ళ మొహం ముందే వెయ్యడానికి ఎంత పిల్లలయినా భాస్కరానికి సంస్కారం అడ్డుపడుతున్నది. పిల్లల ప్రశ్నార్థకాల ముఖాలవైపు తను చూడలేడు! అందుకే... అందుకే ఈ

బాధంతా!...

"అయిందేరా?!" అన్నాడు మరొక్క పది నిముషాలు ఆగి.

"లేదు డాడీ. ఇంకొక పావుగంట పడుతుంది. ఈ ఎస్సే ఫెయిర్ చెయ్యాలి" అన్నాడు బాబీ.

"వెధవ, వెధవన్నర వెధవ. చంపుతున్నాడు" మనసులోనే తిట్టుకుని పైకి విసుగ్గా అన్నాడు.

"ఒరేయ్, రేపు చదువుదువుగాని. ఇప్పుడు పడుకో. నాకు నిద్రొస్తోంది. లైటుంటే నాకు నిద్ర పట్టదు".

భాస్కరం అవస్థ చూస్తుంటే జయకి నవ్వొస్తోంది. నవ్వాగడం లేదు. గట్టిగా నవ్వితే కోప్పడతాడేమోనని భయం వేసి కిమ్మనకుండా వూరుకుంది.

పావుగంటయినా బాబీ పడుకోకపోవడం చూసి అప్పుడు అంది, "బాబీ! చూడు కిరణ్ కూడా పడుకున్నాడు. చాలా రాత్రయిపోయింది. ఇంత రాత్రిదాకా చదివితే నీ ఆరోగ్యం పాడయి పోదూ! ఇలా పగలూ - రాత్రి చదివిస్తే తీరా పరీక్షలొచ్చేసరికి ఏ జ్వరమో వచ్చిందనుకో. అప్పుడు ఎంత అవస్థ! నా మాట విను. మీ నాన్నగారు నీ మంచికోసమే చెప్తున్నారు. నువ్వు రెస్టు తీసుకుంటే పొద్దున్నే ఫ్రెష్‌గా లేచి మళ్ళీ చదువుకుందువుగాని. అదిగాక నాన్నగారు ఆఫీసులో పని చేసిచేసి అలసిపోయి వచ్చారు! టైముకి పడుకోకపోతే రెస్టు ఎలా వుంటుంది చెప్పు? మా బంగారు కొండవి కదూ, పడుకో బాబూ!"

ఎలాగైతేనేం విసుక్కుంటూ లేచాడు బాబీ. పుస్తకాలన్నీ టేబుల్ మీద ఒక వార వుంచేసి వెళ్ళి పడుకున్నాడు.

"హమ్మయ్య" అనుకుని హాయిగా వూపిరి పీల్చుకున్నాడు భాస్కరం.

పెద్దలైటు ఆర్పేశాడు. బెడ్‌లైట్ వేశాడు. కిటికీలోంచి వీస్తున్న చల్లగాలికి ఫానుగాలి తోడయి శరీరాన్ని గిలిగింతలు పెడ్తోంది. పైన చలి. లోపల వేడి. జయ పక్కన పడుకుని గట్టిగా జబ్బ మీద గిల్లేడు, ఆలస్యానికి వుక్రోషంగా. ఆమె కెవ్వుమనబోయి వూరుకుంది.

"వుష్. అంతా తొందరే మీకు. బాబీ ఇంకా పడుకుని వుండడు. ఆగండి కాస్సేపు!" అతని చేతి మీద తన చూపుడువేలితో తాపీగా రాసింది.

"అబ్బ!" గట్టిగా చుట్టేశాడు ఆమెని

"వదలండి. వదలండి ముందు" మళ్ళీ రాసి.

బాబీ అట్నుంచి ఇటు కదిలేడు.

"అయ్యా బాబోయ్" ఏదో ఉపద్రవం ముంచు కొచ్చినట్టు అంత అల్లరి చేస్తున్నవాడు ఠక్కున అటు తిరిగి పడుకున్నాడు బుద్ధిమంతుడిలా!

జయకి భయంగా వుంది. పిల్లలకు కొంచెం జ్ఞానం వస్తున్నది. ఈయన ఇన్నేళ్ళొచ్చినా కొంటెచేష్టలు - తొందరపాటు మానలేదు. అయిదు నిమిషాలు కూడా ఆగేట్టు కనబడడం లేదు మనిషి! మళ్ళీ "పాపం!" అని జాలేసింది. తనకీ అలాగే వుంది నిజం చెప్పాలంటే! కాని ఏం

లాభం? అంతా బాబీమీద ఆధారపడి వుంది. వాడు పడుకున్న తర్వాతే... ఏదయినా!?

"ఇక్కడ కాదు. మరీ సిగ్గూ - ఎగ్గూ లేకుండా పోతున్నది మీకు. ఆ గదిలోకి పదండి" - అని భాస్కరం చేతి మీద రాసింది. వెంటనే లేవబోయాడు భాస్కరం.

"అబ్బ వుండండి. వాడ్ని పూర్తిగా పడుకోనివ్వండి. వాడికి బాగా నిద్ర పట్టిందో లేదో కన్‌ఫర్మ్ చేసుకుని... తర్వాత..."

భాస్కరం సహనాన్ని కోల్పోతున్నాడు. బాబీకి దగ్గరగా వెళ్ళి ముఖం మీద ముఖం పెట్టి చూశాడు. కళ్ళు మూసుకుని పడుకున్నాడు వాడు.

"థాంక్ గాడ్!" అనుకున్నాడు.

జయని చేత్తో తట్టి రమ్మన్నట్టు సంజ్ఞ చేశాడు. జయ నవ్వుకుంటూ లేచింది. ఎడమచేతికి ఒకటే బంగారం గాజు. కుడిచేతికి మాత్రం ఒక బంగారం గాజు, అరడజను మట్టి గాజులు వున్నాయి. సడన్‌గా ఆమె కుడిచేతిని పట్టుకున్నాడు.

"ఈ గాజుల చప్పుడుకి వాడు లేచిపోగలడు" సంజ్ఞలద్వారా ఆమెని వారించాడు. అయినా ఎందుకైనా మంచిదని తనే ఆమె కుడిచేతిని ఎత్తి పట్టుకుని, మెల్లగా నడిపించుకుని తీసుకువెళ్ళాడు. చప్పుడు కాకుండా తన నేర్పంతా చూపిస్తూ అతిజాగ్రత్తగా తలుపు గడియ తీశాడు. గుండె చిత్రంగా స్పందిస్తున్నది. నరాలు వేడెక్కాయి. వళ్ళంతా వేడిగా, ఆవిర్లు వస్తున్నట్టుగా వుంది. అతను వంటింట్లోకి వచ్చి తలుపు లోపల్నుంచి గడియ పెట్టిన తరువాత జయ లైటు వేసింది.

అప్పుడు లభించింది వాళ్ళిద్దరికీ పూర్తి 'స్వేచ్ఛ'. ఆ గాఢపరిష్వంగంలో ఎంత సుఖం! ఆ సుఖం కోసమే ఇన్ని కష్టాలు!!!

"ఎన్నాళ్ళండీ ఇలాగ? కాస్త పెద్ద ఇల్లు చూడండి అంటే వినరు. మనకని వేరే గది వుంటే ఎంత బావుండేది! వాళ్ళ కళ్ళు కప్పి మనం ఎంత కాలం ఇలా చాటు మాటు వ్యవహారం నడపగలం? పిల్లలకి తెల్సిపోయిందంటే ఎంత సిగ్గు!"

"నాకు మాత్రం సరదా అనుకున్నావా ఇన్ని తిప్పలు పడ్డానికి! మనింట్లోనే మనం దొంగల్లా ప్రవర్తించడానికి!" ఆమెని వుక్కిరిబిక్కిరి చేసేస్తూ అన్నాడు.

"మనలాంటి మధ్య తరగతి సంసారుల జీవితాలు ఇలా వెళ్ళవల్సిందే. మనుషుల పాపాల్లా ఇళ్ళ అద్దెలు కూడా రోజు రోజుకీ పెరిగిపోతుంటే మన లాంటి వాళ్ళం పెద్ద ఇల్లు ఎలా తీసుకోగలం? ఇంటికి అద్దె ఇస్తామా, పిల్లల్నే చదివిస్తామా? పాలు, కూరలు, పెట్రోలు, బియ్యం, పప్పులు, సినిమాలు... బట్టలు... ఇవన్నీ ఆకాశంలో పోటీపడు తున్నాయి. మనలాంటి..."

"అబ్బ, జయా! మరేం చెప్పకు. ఈ సుత్తి ఎప్పుడూ వుండేదే. నేనిప్పుడు మంచి మూడ్‌లో వున్నాను. అంటే ఇప్పుడు మనిద్దరికోసం స్వర్గద్వారాలు తెరచుకో బోతున్నాయన్న మాట! అండర్‌స్టాండ్... మై స్వీట్ హార్ట్!" ఆ తర్వాత ఆమెని మరి మాట్లాడనివ్వలేదు. ఇద్దరి వేడి నిట్టూర్పులు ఆ వంటిల్లంతా వ్యాపించాయి. వంటిల్లంతా శుభ్రంగానే వున్నా ఇద్దరిలో ఎవరిదైనా కాలో, చెయ్యో తగిలి ఏ గ్లాసో, గిన్నో ధన్‌మని కింద పడితే ఆ చప్పుడుకి పిల్లలు లేచిపోతారేమోనని భయం

భయంగా వున్నారు.

శృంగారంలోని శిఖరాగ్రాలను చేరుకుంటున్న వుద్వేగభరిత క్షణాలవి!

అప్పుడు హఠాత్తుగా తలుపు మీద చప్పుడయింది.

తుళ్ళి పడ్డారు ఇద్దరూ. ఇద్దరి గుండెలూ వేగంగా కొట్టుకోసాగాయి. జయకి చిరుచెమట్లు పట్టాయి. వంట్లోంచి సన్నని వణుకు!

"ఫర్వాలేదు. భయపడకు!" చేత్తో సంజ్ఞ చేశాడు ధైర్యం చెప్తూ. "నేను బాత్రూం కెళిపోతాను" అని, కుప్పలా పడేసి ఉన్నచీరా జాకెట్టూ బ్రా పుచ్చుకుని పెరటివేపు వెళిపోయింది జయ.

భాస్కరం లుంగీ సరిచేసుకుని వంటింటికీ పడక గదికీ మధ్యఉన్న తలుపు తెరిచేడు. చేతి కందిన గ్లాసు పట్టుకున్నాడు.

బాబీ..... "దాహం వేసింది డాడీ. అమ్మేదీ?... బాత్రూంకెళ్లిందా? వేగిరం నిద్రపోవాలని ఆ గదిలో పడుకుని మళ్లీ ఇక్కడికొచ్చేరేంటి? మీకూ దాహమేసిందా?"

"అవున్రా. నాకూ దాహమే." అన్నాడు భాస్కరం.

మర్నాడు 'లంచిటైముకి' బాబీ 'ఆఫీసుకి' వచ్చేడు. భాస్కరం ఆశ్చర్యంగా చూసేడు. "డాడీ, మనం అర్జంటుగా వుడ్డుపేట వెళ్లాలి, రండి. అక్కడ మా క్లాస్మేట్ రవీ వాళ్ల ఇంట్లో నేం, మంచి పోర్షన్ ఖాళీ ఐంది. కింది బెడ్రూమ్‌లున్నాయి. మేం కావల్సినంతసేపు చదూకోవచ్చు. పైగా రవి మా క్లాస్‌లో అన్ని సబ్జక్ట్‌ల్లోనూ ఫస్టు!... ఆ పోర్షన్‌కి అద్దెకూడా సరిగ్గా మనం ఇస్తున్నదే, ఎనిమిది వందలే... రవి ఏమోచ్చి; ఒరే, మీ పేరెంట్స్‌కి చెప్పి వెంటనే ఇక్కడికి మారిపొండిరా- అన్నాడు, డాడీ!... పదండి, ఆ పోర్షన్ ఫిక్స్ చేస్కుందాం..."

భాస్కరం దాహం వెయ్యకపోయినా గ్లాసుడు నీళ్లుతాగి బాబీతో బయలు దేరేడు.

★ ★ ★

***(చెలిమి, వీక్లీ ; 13-11-1999)***